డీఎల్ ఈడీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపహాడ్, ఆగస్టు 3 : డీఎల్ఈడీ కళాశాలలో ప్రవేశాల కోసం ఐటీడీఏ పీవో రాహుల్ ఏజెన్సీ గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-26 విద్యాసంవత్సరానికి ప్రవేశ ప్రకటన విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. మొత్తం 50 సీట్లు ఉన్నాయని, ఏజెన్సీ ప్రాంత విద్యార్థులే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రిన్సిపల్, డీఎల్ఈడీ కళాశాల, చర్ల రోడ్, భద్రాచలం పేరుతో దరఖాస్తు చేసుకోవాలని, 25వ తేదీ ఆఖరు అని, పూర్తి వివరాలకు 9959575539, 7981255624లను సంప్రదించాలని పీవో కోరారు.

పాట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

బూర్గంపహాడ్, ఆగస్టు 3 : భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రధానంగా తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేసి ఆత్మబలిదానం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి పొట్టిశ్రీరాములుకు పెట్టిన పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు చారుగుళ్ల శ్రీనివాస్ తన కార్యవర్గంతో కలిసి శనివారం డిమాండ్ చేశారు.

డీవైఎఫ్ఐ కృషి అభినందనీయం

బూర్గంపహాడ్, ఆగస్టు 3 : ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాలను అరికడదాం... సమాజాన్ని కాపాడుదాం అనే కార్యక్రమంతో యువతలో చైతన్యం నింపడం అభినందనీయమని భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ అన్నారు. శనివారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాలంగి హరికృష్ణలు ఏఎస్పీ చేతులమీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతను మత్తులో ముంచి చిత్తుచేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలని కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భూపేందర్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను పరిశీలించిన ఐటీడీఏ జనరల్

బూర్గంపహాడ్, ఆగస్టు 3 : ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన మహనీయుల విగ్రహాలను ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ జనరల్ డేవిడ్‌రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదివాసీ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంవో రమణయ్య, టిఏ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, పూనెం కృష్ణ, రమేష్‌లు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బూర్గంపహాడ్, ఆగస్టు 3 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ అన్నారు. శనివారం భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాద నివారణకు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, నిబంధనలు పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయన్నారు. యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి బానిసలు కావొద్దని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రామకృష్ణ, రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ హెచ్.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో ఆనందబాబు, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, తోట జయప్రసాద్, కొప్పుల మురళి పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ పేరుతో కాంగ్రెస్ మోసం

మణుగూరు టౌన్, ఆగస్టు 3 : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఎక్కడా స్పష్టత లేదని, 2025-29 వరకు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ల పూర్తి వివరాలు మరిచిందని యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం సృజన్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ నిరంతర ప్రక్రియ అంటూ మాయమాటలు చెబుతున్న కాంగ్రెస్ మోసం చేస్తుందన్నారు.నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ వైఖరి తేల్పాలని ప్రశ్నించారు. సమావేశంలో యువజన నాయకులు జక్కం రంజిత్,తాళ్లపల్లినాగరాజు, డేగల సంపత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసేందుకే..

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 3: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఎక్కడా స్పష్టత లేదని, నిరుద్యోగులను మోసం చేసేందుకు రూపొందించిందిగా ఉన్నదని బీఆర్ఎస్ యూత్ నాయకులు, మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్ అన్నారు. శనివారం దిబ్బగూడెం గ్రామంలో నిరుద్యోగులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో 2025-29 వరకు నియామకాలకు నోటిఫికేషన్‌లో పూర్తి వివరాలు లేవన్నారు. జాబ్ క్యాలెండర్ అనేది నిరంతర ప్రక్రియ అంటూ నిరుద్యోగులను మాయమాటలతో నమ్మిస్తుందని ఆరోపించారు. నిరుద్యోగులందరికీ న్యాయం జరిగే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కిన్నెరసాని నుంచి 4వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ రూరల్, ఆగస్టు 3: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి శనివారం రాత్రి 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 407 అడుగులు. ఉదయం నుంచి 3300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండడంతో సాయంత్రానికి నీటిమట్టం 404.4 అడుగులకు చేరింది. డ్యామ్‌సైట్ అధికారులు ఒక గేటు ఎత్తి 4000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

మురుపాలే బిడ్డకు శ్రేయస్కరం

జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు
అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసనలు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 3.(నమస్తేతెలంగాణ) : పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవోలు చాటిచెప్తున్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోషణ్ అభియాన్ ఉద్యోగులు, ఐసీడీఎస్ బృందం తల్లులకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 11 ప్రాజెక్టుల పరిధిలో ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నందు సూపర్‌వైజర్లు తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి తల్లిపాలు గురించి అవగాహన కల్పిస్తున్నారు. పాల్వంచ ప్రాజెక్టు పరిధిలో చాతకొండ, హమాలీ కాలనీ, ప్రశాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీవో ప్రసన్నలక్ష్మి తల్లులకు అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పులు విజేత ఆయా ప్రాజెక్టుల పరిధిలో కేంద్రాలను సందర్శించి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాల్వంచ ఐసీడీఎస్ ప్రాజెక్టులో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో ప్రసన్నలక్ష్మి

నందిపాడులో...

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 3: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని 25వ వార్డు కౌన్సిలర్ సాహేరా బేగం అన్నారు. మున్సిపాలిటీలోని 25వ వార్డు గాజుల రాజం బస్తీ 5,6,7 సెంటర్ ఐసీడీఎస్ అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, భారతి, టీచర్లు పద్మ, శైలజ, రాజకుమారి పాల్గొన్నారు.

26వ వార్డులో...

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 3: మున్సిపాలిటీలోని 26వ వార్డు హనుమాన్‌బస్తీ అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ర్యాలీని బీఆర్ఎస్ కౌన్సిలర్ అంబుల వేణుగోపాల్ ప్రారంభించారు. టీచర్లు పద్మావతి, శేషకుమారి, లావణ్య, ఆర్‌పీలు లలిత, ఆయాలు రాములమ్మ, సహేరా బేగం, వార్డు మహిళలు పాల్గొన్నారు.

నందిపాడులో..

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 3: మండలలోని నందిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం-2లో చిన్నారులకు అన్నప్రాసన్న కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సౌజన్య, హెచ్ఎం కృష్ణారావు, జీపీ కార్యదర్శి ఆలివేలు,అంగన్‌వాడీ టీచరు, తల్లులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిలో...

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 3: అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలని సీడీపీవో ప్రసన్నలక్ష్మి అన్నారు. మండలంలోని ప్రశాంతినగర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్ సుజాత, తల్లులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, ఆగస్టు 3: అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా రక్షణ కవచంలా సహాయపడతాయని అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ కే.అనురాధ అన్నారు. మండలంలోని బేతంపూడి పంచాతీని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. విజయ, ఎల్లమ్మ, అంతోటి లీలాబాయి, శ్రావణి, నీల, కార్యదర్శి మీనాకుమారి పాల్గొన్నారు.

సుబ్బంపేటలో..

చర్ల, ఆగస్టు 3: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం మండలంలోని సుబ్బంపేట అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బంపేట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జగదంబ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సర్వేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారులకు పదోన్నతులు

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 3: సింగరేణి సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు, బదిలీలు చేపడుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్జీ3, భూపలపల్లిలో డీజీఎం ఫారెస్ట్రీ బి.కర్ణాకు మందమర్రి, బెల్లంపల్లి ఏరియా, కొత్తగూడెం, ఇల్లెందు డీజీఎం ఫారెస్ట్రీ ఏబీ హరినారాయణకు ఆర్జీ1, భూపాలపల్లికి, ఆర్జీ1, ఆర్జీ2 మేనేజర్ ఫారెస్ట్రీ ఆర్‌బీ డేవిడ్ అభిలాష్‌కు కార్పొరేట్, మణుగూరు ఏరియాకు, ఎస్‌టీపీపీ మేనేజర్ ఫారెస్ట్రీ చంద్రమణిని ఎస్టీపీపీ, శ్రీరాంపూర్‌కు, మందమర్రి, శ్రీరాంపూర్ మేనేజర్ ఫారెస్ట్రీ ఆర్‌వీ రమణారెడ్డిని కొత్తగూడెం, ఇల్లెందుకు, కార్పోరేట్, మణుగూరు ఫారెస్టు ఆఫీసర్ బోడెంపుడి కల్యాణ్‌ను ఆర్జీ3కి, బెల్లంపల్లి ఫారెస్టు ఆఫీసర్ ఆర్. నవీన్‌కుమార్‌ను ఆర్జీ2కు బదిలీ చేశారు. మందమర్రిలో డిప్యూటీ ఎస్ఎస్‌వోగా ఉన్న గుబ్బల వెంకటేశ్వరరావును అదే ఏరియా సర్వే ఆఫీస్‌కు, ఆర్జీ2లో డీవై ఎస్ఎస్‌వోగా ఉన్న అయ్యగారి కోటేశ్వరరావును భూపాలపల్లికి బదిలీ చేశారు. అడ్రియాలా ప్రాజెక్టు అడిషనల్ జీఎంగా ఉన్న బి. సీతారామంను కార్పొరేట్‌కు, హైదరాబాద్ మార్కెటింగ్ అండ్ మూమెంట్‌లో అడిషనల్ జీఎంగా ఉన్న ఎన్‌వీ రాజశేఖర్‌రావును, మందమర్రిలో అడిషనల్ జీఎంగా ఉన్న జోష్యుల నాగరాజును విజయవాడ అప్మెల్‌కు బదిలీ చేశారు. మందమర్రి ఏరియా హాస్పిటల్‌లో డిప్యూటీ సీఎంవోగా ఉన్న డాక్టర్ మడిరాజు ఉషను కార్పొరేట్ ప్రధాన ఆస్పత్రికి బదిలీ చేశారు. భూపాలపల్లి డివై జీఎం కుమారస్వామిని ఆర్జీ1కు, శ్రీరాంపూర్ సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ స్వప్నను మందమర్రికి బదిలీ చేశారు. శ్రీరాంపూర్ సూపరింటెండెంట్ జియాలజిస్టు శ్రీనివాస్‌ను కార్పొరేట్‌కు, కార్పొరేట్ డిప్యూటీ సూపరింటెండెంట ఆఫ జియాలజిస్టు పెద్ద రాజును ఆర్జీ1కు, ఆర్జీ1 డిప్యూటీ సూపరింటెండెంట్ జియాలజిస్టు డి.శ్రీనివాస్‌ను కార్పొరేట్‌కు బదిలీ చేశారు. కార్పొరేట్‌లో సీనియర్ జియాలజిస్టు హరిప్రసాద్‌ను కార్పొరేట్‌కు, కార్పొరేట్ సీనియర్ జియాలజిస్టు కేవీ రాజేశ్వరరావును ఆర్జీ1కు, ఆర్జీ1లో డిప్యూటీ సూపరింటెండెంట్ హైడ్రాలజిస్టు వెంకన్నను కార్పొరేట్‌కు, కార్పొరేట్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ హైడ్రాలజిస్టును రమేష్‌ను ఆర్జీ1కు, ఆర్జీ1 డిప్యూటీ సూపరింటెండింగ్ జియోఫిజిస్ట్ సుమనను కార్పొరేట్‌కు బదిలీ చేశారు.

ఆ 'యూ'టర్న్‌లో ఆదమరిస్తే అనర్థమే..!

పట్టణ నడిబొడ్డున రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 3: పట్టణంలో పరిపాలన రోజు రోజుకీ అస్తవ్యస్థంగా మారుతోంది.. వాహనదారుల ప్రాణాలంటే లెక్కలేనట్లుగా వ్యవహరిస్తున్నారు కొందరు అధికారులు.. ముఖ్యంగా జిల్లా కేంద్రమై ఉండి కూడా ఎక్కడ సమస్యలు ఉన్నా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణ కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో యూటర్న్ వద్ద నిర్లక్ష్యంగా వదిలేసిన ఇనుప కడ్డీయే సాక్ష్యంగా నిలిచింది. పట్టణంలోని సింగరేణి చిల్డ్రన్స్ పార్క్ ఎదురుగా ఉన్న యూ టర్నలో కొన్ని నెలల క్రితం ట్రాఫిక్ 'ఐ ల్యాండ్' ఏర్పాటు చేశారు. కానీ కొన్ని రోజులకే అనివార్య కారణాలతో దాన్ని తొలగించారు. దీంతో ఐ ల్యాండ్ తొలగించే సమయంలో విరిగిన ఐరన్ లెగ్ (రాడ్డు) భూమిలో అలానే ఉండిపోయింది. నెలలు గడుస్తున్నా కూడా మున్సిపల్ అధికారులు దాన్ని అలానే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు తప్ప, తొలగించే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు సమస్యలపై దృష్టి సారించి సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని యూ టర్న్ వద్ద నిర్లక్ష్యంగా వదిలేసిన ఇనుపరాడ్డు

రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలి
ఎంపీపీ రేసు లక్ష్మి

దుమ్ముగూడెం, ఆగస్టు 3: మండలంలో రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేసేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రేసు లక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని లక్ష్మీనగరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం ఆమె మాట్లాడుతూ మండలంలో మొదటి విడత రూ.లక్షలోపు 2,200 మందికి రూ.22కోట్లు, రెండవ విడతలో రూ.లక్ష, రూ.లక్షన్నర 1,180 మందికి రూ.31కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. చాలామంది రైతులు అర్హులైనప్పటికీ అనర్హులుగా బ్యాంకు అధికారులు చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వ్యవసాయశాఖ సమగ్ర నివేదిక తయారుచేసి అందరికీ వర్తింపచేయాలని ఏవో నవీన్‌కుమార్‌కు సూచించారు. దుమ్ముగూడెం ఎంపీటీసీ చిలకమ్మ ప్రజాప్రతినిధులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో ముత్యాలరావు, పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీపీ రేసులక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీటీసీలను సత్కరించారు. సమావేశంలో మండల కార్యదర్శి కణితి రాముడు, తునికి కామేశ్, కణితి లక్ష్మణ్, శ్రీనివాసరావు, పొడియం సుబ్బారావు, అల్లాడి వెంకట్, బొల్లి శేఖర్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లోన్ కట్టినా బంగారం ఇవ్వడం లేదు..
బ్యాంకు ఎదుట గోల్డ్‌లోన్ బాధితురాలి నిరసన

చండ్రుగొండ, ఆగస్టు 3: లోన్ కట్టినా బంగారం ఇవడం లేదని బాధితురాలు స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట శనివారం నిరసన చేపట్టింది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని తిప్పనపల్లికి చెందిన సయ్యద్ మస్తాన్‌బీ తన భర్త పకీర్‌అహ్మద్ ఈ ఏడాది జనవరిలో మృతి చెందాడు. భర్త పేరున ఉన్న గోల్డ్‌లోన్ నగదు మొత్తం రూ.80వేలు చెల్లించింది. బ్యాంకు అధికారులు భర్త డెత్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు తీసుకొస్తేనే బంగారం ఇస్తామని చెప్పగా మే నెలలో సంబంధిత కాగితాలు ఇచ్చింది. అయినప్పటికీ తన బంగారం ఇవ్వాలంటే మరో నెల రోజులు ఆగాలి అని చెప్పడంతో శనివారం బ్యాంకు ఎదుట మస్తాన్‌బీ నిరసన చేపట్టింది. దీనిపై బ్యాంకు మేనేజర్ హతిరాంను వివరణ కోరగా.. ఆడిట్ కోసం బ్యాంకులో లెక్కలు సరి చేస్తున్నామని, ఆడిట్ అయిపోయిన వెంటనే హైదరాబాద్ కార్యాలయానికి కాగితాలు పంపి బంగారం ఇస్తామని వివరించాడు.

తాతపై మనవడు కత్తితో దాడి

ఆళ్లపల్లి, ఆగస్టు 3 : తాతపై మనవడు కత్తితో దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మెస్సు దేవయ్య అతడి బిడ్డ కుమారుడు కొర్స సంపత్ శుక్రవారం రాత్రి ఘర్షణపడ్డారు. మద్యానికి బానిసైన మనవడు తాతను తరచూ మద్యానికి డబ్బులు ఇవ్వాలని బెదిరించేవాడు. శుక్రవారం రాత్రి మద్యానికి డబ్బులు అడుగగా దేవయ్య నిరాకరించాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది ఈ క్రమంలో దేవయ్యపై కూరగాయాలు కోసే కత్తితో సంపత్ దాడి చేశాడు. దేవయ్య ఎడమ చేయి, తొడపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆళ్లపల్లి, ఆగస్టు 3 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం మధ్యాహ్నం వెంకటాపురం గ్రామానికి చెందిన గోగ్గెల సురేశ్ మండలకేంద్రం నుంచి మర్కోడు వైపు వెళ్లి వస్తుండగా మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 ద్వారా స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు తరలించారు.

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్టు

అశ్వాపురం, ఆగస్టు 3 : చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్టు అయిన ఘటన శనివారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మిట్టగూడెంనకు చెందిన కొర్సా దుర్గారావుపై కొంతకాలం క్రితం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో చెక్‌బౌన్స్ కేసు నమోదైంది. కోర్టు వాయిదాలకు సక్రమంగా హాజరుకాకపోగా వారెంటు కావడంతో శనివారం దుర్గారావును న్యాయమూర్తి ఆదేశాల మేరకు భద్రాచలం సబ్‌జైల్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పోలీసుల తనిఖీలు

మణుగూరు టౌన్, ఆగస్టు 3 : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మణుగూరు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం పగిడేరు, రామానుజరం కూడళ్ల వద్ద సీఐ సతీశ్‌కుమార్, సిబ్బందితో విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ప్రవర్తించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ధ్రువ పత్రాలు లేని వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించి విధిగా బండితో పత్రాలు ఉంచాలని సూచించారు.

దుర్గామాత ఆలయంలో చోరీ

రామవరం, ఆగస్టు 3: ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ స్వర్ణ దుర్గ మాతా దేవాలయంలో ఉన్న అమ్మవారి రెండు జతల వెండి కళ్లు, వెండి త్రిశూలంతో పాటు హుండీలో ఉన్న సుమారు రూ.20 వేలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు నిర్వాహకులు తెలిపారు. టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలదాడిలో ఆరు మేకలు మృతి

చర్ల, ఆగస్టు 3: మండలంలోని రైసుపేట గ్రామంలో శుక్రవారం రాత్రి మేకలపై కుక్కలు దాడి చేసి హతమార్చాయి. గ్రామానికి చెందిన పడిగెల నారాయణ తన మేకలను ఇంటి అవరణలోని పాకలో ఉంచిన ఆరు మేకలపై 10 కుక్కలు దాడి శాయి. కుక్కల అరుపులు విని బయటికి వచ్చేసరికి కుక్కలు మేకల గొంతులు కొరకడంతో మృతిచెంది ఉన్నాయి. వీటివిలువ సుమారు రెండు లక్షలవరకు ఉంటుందని బాధితుడు నారాయణ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చర్ల, ఆగస్టు 3: మండలంలోని తాలిపేరు రిజర్వాయర్‌లో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉంది. రిజర్వాయర్ ఎగువప్రాంతం నుంచి మృతదేహం కొట్టుకువచ్చి ఉంటుందని తెలిపారు. వయసు సుమారు 35 ఉంటుందన్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 3: భార్యను వేధిస్తున్న భర్తపై శనివారం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బచ్చువారిగూడెనికి చెందిన సాయికుమారికి ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం బికొండెపాడు గ్రామానికి చెందిన రుద్ర సత్యదేవ సూర్యనారాయణకు మూడేళ్ళ క్రితం వివాహం జరిగింది. భార్య భర్తలు కొంతకాలంగా బచ్చువారిగూడెంలోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలోనే భార్యపై అనుమానంతో మానసికంగా, శారీరకంగా వేధింపులుకు గురిచేస్తుండేవాడు. బాధితురాలు సాయికుమారి ఫిర్యాదు మేరకు భర్త సూర్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

సంత నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

సారపాక, ఆగస్టు 3 : సారపాకలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో పాటదారుడు నిబంధనల ప్రకారం కాకుండా అధికమొత్తంల్లో వసూళ్లు చేస్తున్నారని, అతనిపై చర్యలు చేపట్టాలని ఈవో కంది మహేశ్‌కు కాంగ్రెస్ నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు గోనె రేణుక, నాయకులు ఇంగువ రమేశ్ మాట్లాడారు. వసూళ్ల ప్రక్రియపై దృష్టి సారించి నిబంధనలను అతిక్రమించినందుకు చర్యలు తీసుకోవాలని, సంతకు సంబంధించి నిబంధనలతో కూడిన ప్లెక్సీలు అక్కడ ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో రత్నారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై నిత్యం స్పెషల్ డ్రైవ్‌లు

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 3: కొత్తగూడెంలో ఇకపై నిత్యం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేష్‌కుమార్ అధ్యక్షతన శనివారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనదారులకు డీఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, వన్‌టౌన్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గొత్తికోయల గ్రామంలో వైద్యశిబిరం

చండ్రుగొండ, ఆగస్టు 3: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులోని గొత్తికోయల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయనపేటలో ఆరోగ్య వైద్యశిబిరం

అశ్వాపురం, ఆగస్టు 3 : మండలంలోని మిట్టగూడెం సబ్‌సెంటర్ పరిధిలో